మర్యాదపూర్వక కలయిక



దుండిగల్ తహసీల్దార్‌కు అభినందనలు తెలుపుతున్న మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్

సుభాష్‌నగర్: దుండిగల్–గండిమైసమ్మ మండల నూతన తహసీల్దార్‌ను గురువారం మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ అధ్యక్షుడు కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు శ్రావణ్, కిరణ్‌కుమార్, దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాహుల్ తదితరులు ఉన్నారు.

మేడారం జాతరలో హలాల్ నిషేధించాలి

సుభాష్‌నగర్: ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతరైన సమ్మక్క సారక్క మేడారం జాతరలో గిరిజన సంప్రదాయానికి విరుద్ధంగా గొర్రెలు, మేకలు, కోళ్లను హలాల్ చేస్తున్నారని.. దీనిని వెంటనే నిషేధించాలనీ బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్యామ్ రావు అన్నారు. గురువారం బహదూర్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరలో భక్తులకు ఆటంకం కలిగే విధంగా విచ్చలవిడిగా విక్రయిస్తున్న కల్తీ మద్యాన్ని వెంటనే అరికట్టాలన్నారు. మేడారం గిరిజన జాతరలో గిరిజనులకే ప్రాధాన్యత ఇచ్చి, గిరిజనులనే పూజారులుగా నియమించాలన్నారు. దీనిని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కూన శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న శ్రీవరసిద్ధి వినాయక ఆలయ కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కూన శ్రీశైలంగౌడ్‌ను గురువారం గాజులరామారం ప్రాంతానికి చెందిన శ్రీవరసిద్ధి వినాయక ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయంలో జరగనున్న శ్రీవరసిద్ధి వినాయక పంచమ మహోత్సవానికి రావాలని కోరుతూ శ్రీశైలంగౌడ్‌ను ఆహ్వానించారు.

ఓపెన్ నాలాల్లో చెత్తను తొలగించండి



జీడిమెట్ల ఫేజ్–3లోని నాలాలో పేరుకుపోయిన చెత్త

జీడిమెట్ల: పారిశ్రామిక ప్రాంతంలోని ఓపెన్ నాలాల్లో ఉన్న చెత్తను ఐలా మున్సిపల్ సిబ్బంది తొలగించాలని పరిశ్రమల యజమానులు కోరుతున్నారు. కొన్ని నెలలుగా నాలాల్లో చెత్తాచెదారాలు నిల్వ ఉండటంతో దుర్వాసన వెలువడుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీడిమెట్ల ఫేజ్–3లోని ఓపెన్ నాలాలు చెత్తాచెదారాలతో నిండిపోయి ఉన్నాయి. నాలాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాల్సిన ఐలా పారిశుద్ధ్య సిబ్బంది తొలగించడంలేదు. చెత్త ఉండటంతో పందులు సైతం నాలాల్లో దొర్లాడుతున్నాయని వారు అంటున్నారు. ఈ విషయమై స్థానికంగా ఉన్న పరిశ్రమల యజమానులు పలుమార్లు ఐలా మున్సిపల్ సిబ్బందికి తెలిపినా వారు పట్టించుకోవడం లేదని పారిశ్రామికవేత్తలు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ సిబ్బంది పట్టించుకుని నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు.

ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాల తొలగింపు



ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలిసిన ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం



ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తూ నాటిన రాడ్లు

దుండిగల్: హైకోర్టు తీర్పు నేపథ్యంలో గురువారం మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి చెందిన దుండిగల్‌లోని ఏరోనాటికల్, ఎంఎల్ఆర్ఐటీఎం కళాశాలల్లో గురువారం ఇరిగేషన్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. దుండిగల్ చిన్న దామర చెరువును ఆక్రమించి చేపట్టిన షెడ్లు, ఇతర నిర్మాణాలను ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ సారా, దుండిగల్ తహసీల్దార్ సయ్యద్ మతిన్, దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణల నేతృత్వంలో జేసీబీలతో తొలగించారు. అదే విధంగా చెరువు ఎఫ్‌టీఎల్‌ను, సరిహద్దు గ్రామాల హద్దులను నిర్దేశిస్తూ రాడ్లను నాటారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన షేక్ రఫిక్

సుభాష్‌నగర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం ప్రాంతానికి చెందిన షేక్ రఫిక్ గత కొంత కాలంగా భార్యాపిల్లలకు దూరంగా ఉంటూ స్థానికంగా రోడ్లపై భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. కాగా ఇటీవల ఇతని ఎడమ కాలి వేళ్లకు ఇన్‌ఫెక్షన్ రావడంతో వాటిని తొలగించారు. గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో తట్టుకోలేని రఫిక్ గురువారం తెల్లవారుజామున మల్లారెడ్డి ఆస్పత్రి సమీపంలోని భీమా గార్డెన్స్ పక్కన ఉన్న ఓ కమర్షియల్ కాంప్లెక్స్ రైలింగ్ గోడకు సైలాన్ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్, నూతన పనులు

ఒకేసారి షురూ

హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



రాజీవ్ గృహకల్పలో ఇటీవలే ప్రారంభించిన రోడ్డు పనులు



జగద్గిరిగనర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు..

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇటీవలే సుమారు కోటి యాభై లక్షలతో పనులు ప్రారంభించారు. ఎన్నికల సమయంలో మొదలు కాని పనులతో పాటు కొత్తగా పెట్టిన టెండర్లు అన్ని ఒకేసారి మొదలయ్యాయి. ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న రోడ్డు పనులు పూర్తి అవుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇవే కాకుండా గురువారం జోనల్ కార్యాలయంలో జరిగిన మీటింగ్‌లో మిగిలిన అంతర్గత రోడ్లకు రూ.3కోట్లతో ప్రతిపాదనలు పెట్టారు.

◆ ఈ ప్రాంతాల్లో ప్రారంభమైన సీసీ రోడ్ల పనులు...

జగద్గిరినగర్‌లో దుర్గామాత ఆలయ సమీపంలో 3 అంతర్గత రోడ్లు సుమారు రూ.55లక్షలతో పూర్తి చేసారు. రింగ్ బస్తీలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో రూ.22లక్షలతో పనులు పూర్తి అయ్యాయి. రాజీవ్ గృహ కల్పలో రూ.28లక్షలతో క్రితం వారం ప్రారంభించారు. ఈ వారం కూన మహాలక్ష్మినగర్‌లో రూ.16లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభంకానున్నాయి.

◆ ప్రతిపాదనలో ఉన్న పనులు..

షిరిడీహిల్స్‌లోని సీసీ రోడ్డు పనులకు రూ.71లక్షలు. సంజయ్‌పురి కాలనీ బి–బ్లాక్ రోడ్ నం.12, 13లకు రూ.30లక్షలు. మగ్దూంనగర్ నుంచి సీసాలబస్తీ, అంతర్గత రోడ్లకు రూ.1.20 కోట్లు, సోమయ్యనగర్‌లోని రోడ్డు పనులకు రూ.40లక్షలు, భూదేవిహిల్స్ అంతర్గత రోడ్లకు రూ.48లక్షలు, రోడ్డు డివైడర్ కోసం రూ.28లక్షలు, బీరప్పనగర్ రోడ్డు మరమ్మతుల కోసం రూ.50లక్షలకు ప్రతిపాదనలు ఇచ్చారు. దీనికి జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి వీలైనంత తొందరగా ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసేటట్లు చూస్తానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ జగన్ తెలిపారు.

మమ అనిపించారు.!



పాత సీసీ రోడ్డును తొలగించకుండానే అక్కడక్కడ కంకర వేసిన దృశ్యం

సుభాష్‌నగర్: ప్రజల ఉపయోగార్థం చేసే అభివృద్ధి పనులు పది కాలాల పాటు పటిష్టంగా ఉండాలంటే నాణ్యత ఎంతో అవసరం. వాటి పునాదులు బలంగా ఉంటే నిర్మాణం గట్టిగా ఉన్నట్టే. కానీ కొంతమంది కాంట్రాక్టర్లు ఇవేమీ పట్టనట్లు నాసిరకంగా పనులు చేస్తూ పైన మెరుగులు దిద్ది మమ అనిపిస్తున్నారు. కొంపల్లి డివిజన్ దూలపల్లి లోని 14వ వార్డు 120 గజాలలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం నిమిత్తం గతంలో సీసీ రోడ్డును మధ్యలో నుంచి పగలగొట్టారు. దీంతో ఆ రోడ్డు మొత్తం ధ్వంసమైంది. పనులు చేజిక్కించుకున్న ఓ కాంట్రాక్టర్ అతుకులు.. గతుకులుగా ఉన్న పాత సీసీ రోడ్డును తొలగించకుండానే దాని మీదనే రాత్రికి రాత్రి సీసీ రోడ్డు వేసి చేతులు దులుపుకున్నాడు. ఈ విషయమై సంబంధిత అధికారులు విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రాత్రికి రాత్రి నాసిరకంగా వేసిన సీసీ రోడ్డు

ఇది శీర్షాసనం కాదు!



మందుబాబులకు చుక్క పడిందంటే ఈ లోకాన్ని మరిచి వింత వింతగా ప్రవర్తిస్తుంటారు. షాపూర్‌నగర్‌లో ఓ మందుబాబు మద్యం సేవించి ఇలా తలకిందులుగా ఆసనం వేయడంతో అటుగా వెళ్లేవారు కడుపుబ్బా నవ్వుకున్నారు.
– సుభాష్‌నగర్

మొక్కల సంరక్షణ ఏది?



ఐడీపీఎల్ చౌరస్తాలో ఎండిపోతున్న మొక్కలు

రంగారెడ్డినగర్: ప్రధాన కూడళ్ల అభివృద్ధిలో ఏర్పాటు చేసిన గ్రీనరీ.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎండుపోతోంది. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని ఐడీపీఎల్, అయోధ్యనగర్ చౌరస్తాల్లో ట్రాఫిక్‌కు ఆటంకం కలుగకుండా రోడ్లను విస్తరించారు. ఆపై ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు వీలుగా రోడ్డు వెంబడి గ్రీనరీని ఏర్పాటు చేశారు. అయితే కొన్ని రోజుల పాటు మొక్కల సంరక్షణను పట్టించుకున్న అధికారులు ఆపై గాలికొదిలేశారు. మొక్కలకు నీళ్లు పోయకపోవడంతో ఇటీవల పెరిగిన ఉష్ణోగ్రతలకు ఎండుతున్నాయి. ఇప్పటికైనా లక్షలాది రూపాయాలు వెచ్చించి నాటిన మొక్కలకు సంబంధిత అధికారులు ప్రతిరోజు నీటిని అందించి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసి సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కోరగా ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా శంభీపూర్‌రాజు మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నాలాల వద్ద చెత్త వేయకుండా కంచె ఏర్పాటు



నాలా వద్ద కంచెను వేస్తున్న సిబ్బంది

జగద్గిరిగుట్ట: నాలాల వద్ద చెత్తను వేయకుండా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం మాత్రం కనిపించడం లేదు. చెత్త వేయకుండా నాలాలను ఇరువైపుల కంచెను ఏర్పాటు చేసారు. కాని అవి మాకేమి పట్టన్నట్లు ఏర్పాటు చేసిన గ్రిల్ పై నుంచి విసిరేస్తున్నారు. అంతే కాకుండా రాత్రి సమయాలలో కిందివైపు కంచెను తొలగించి చెత్తను పడేస్తున్నారు. ఇక్కడ చెత్తను వేస్తే జరిమానా విధిస్తామని బోర్డులను సైతం పెట్టారు. కాని అవి మాకు వర్తించవన్నట్లు కొందరు వ్యవహరిస్తున్నారు. రానున్న వానకాలం దృష్టిలో పెట్టుకొని చెత్తను వేయకుండా కఠిన చర్యలు చేపట్టి అరికట్టాలని కోరుతున్నారు.

సన్నాహక బస్సు యాత్ర విజయవంతానికి కృషి చేయాలి



బీజేపీ సన్నాహక బస్సు యాత్ర నేపథ్యంలో సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: బీజేపీ చేపట్టిన సన్నాహక బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని ఆ పార్టీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి అన్నారు. ఈనెల 25న ప్రారంభం కానున్న సన్నాహక యాత్ర ఏర్పాట్లపై గురువారం గాజులరామారంలోని బీజేపీ అసెంబ్లీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు సన్నాహక బస్సు యాత్ర చేపట్టామన్నారు. స్థానిక సమస్యలపై నాయకులు ఈ యాత్రలో గళమెత్తాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధనరెడ్డి, విగ్నేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బావిగడ్డ రవి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సులోచన, జహీరాబాద్ ప్రభారీ నటరాజగౌడ్, 126 డివిజన్ ఇన్‌చార్జి మోతే శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు సాయినాథ్, పున్నారెడ్డి, పరుష వేణు, పత్తి సతీష్, దుర్యోధన్ రావు, కంది శ్రీరాములు, రాజేశ్వర్ రావు, పులి బలరామ్, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శులు భానుచందర్, బీజేవైఎం జిల్లా స్పోకెస్ పర్సన్ అఖిల్, బీజేవైఎం కన్వీనర్ సాయి రామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన డంపింగ్

రాకపోకలకు ఇబ్బందులు



షాపూర్‌నగర్ సిగ్నల్స్ సమీపంలో డంపింగ్

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్ల వెంబడి వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారు. షాపూర్‌నగర్ నుంచి ఐడీపీఎల్‌కు వెళ్లే దారిలోని షాపూర్‌నగర్ సిగ్నల్స్ సమీపంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఆనుకుని సిమెంట్ దిమ్మెలు, విద్యుత్ స్తంభం తదితర వ్యర్థాలను డంప్ చేశారు. నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు మార్గంలో హడావుడిగా వెళ్లే వాహనదారులు రోడ్డు పక్కన డంప్ చేసిన వ్యర్థాలను ఢీకొని గాయాలపాలయ్యే ఆస్కారముంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సదరు సిమెంట్ వ్యర్థాలను అక్కడ నుంచి తరలించి వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తా

చింతల్ కార్పొరేటర్ రషీదారఫీ



జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రషీదా రఫీ

చింతల్: డివిజన్ అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తానని చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదా రఫీ అన్నారు. గురువారం కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో జెడ్‌సీ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 128 చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదా మహ్మద్ రఫీ డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలనీ కోరారు.

డివిజన్ అభివృద్ధిలో భాగంగా జెడ్‌సీకి విన్నవించిన పనుల ప్రతిపాదనలు

◆ వల్లభాయ్ పటేల్ నగర్ అంతర్గత గల్లీలలో సీసీ రోడ్లు వేయడం, చింతల్ శ్మశానవాటిక అభివృద్ధిలో భాగంగా మరుగుదొడ్లు, గ్యాలరీ, ప్రవేశ ఆర్చ్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, భగత్‌సింగ్‌నగర్ శ్మశానవాటిక డెవలప్‌మెంట్ కోసం ప్రవేశ ద్వారం, ఫుట్‌పాత్‌ల పనులు. భగత్‌సింగ్‌నగర్ హిందూ శ్మశానవాటిక వద్ద ఫుట్‌పాత్, బర్నింగ్ ప్లాట్‌ఫారమ్, వాష్‌రూమ్‌లు, ఎంట్రన్స్ ఆర్చ్, కాంపౌండ్ వాల్ వంటి ప్రాథమిక సౌకర్యాల పనులు. భగత్‌సింగ్ నగర్ ముస్లిం శ్మశానవాటిక వద్ద ఫుట్‌పాత్, వజుఖానా, వాష్‌రూమ్‌లు, ఎంట్రన్స్ ఆర్చ్, కాంపౌండ్ వాల్ నిర్మాణం వంటి ప్రాథమిక సౌకర్యాల పనులు, రోడామేస్త్రీ నగర్‌లో రాయల్ స్టార్ స్కూల్ నుంచి ముస్లిం శ్మశానవాటిక వరకు బాక్స్ డ్రెయిన్ నిర్మాణం, హెచ్ఎంటీ కాలనీలో మున్సిపల్ ఎక్స్‌రోడ్ నుంచి వేంకటేశ్వరస్వామి గుడి దగ్గర నుంచి మస్జీద్ వరకు ఆఫీ రోడ్ పునరుద్ధరణ పనులు దుర్గయ్యనగర్‌లోని రెండు కల్వర్ట్(బ్రిడ్జి) పునరుద్ధరణ పనులు, రోడా మేస్త్రీనగర్‌లో అల్ అక్సా మసీదుకు ఎదురుగా 19వ బ్లాక్‌లో అంతర్గత కాలనీల్లో సీసీరోడ్ల పనులు, రంగానగర్ రోడ్ నం.4 నుంచి 9 వరకు సీసీ రోడ్ల పనులు, పట్వారీ ఎన్‌క్లేవ్, షారోన్ చర్చి వద్ద సీసీరోడ్ల పనులు, భగత్‌సింగ్‌నగర్ రోడ్ నం.46 నుంచి 57 వరకు సీసీ రోడ్ పనులు, భగత్‌సింగ్‌నగర్ రోడ్ నం.1 సీసీ రోడ్ పనులు, భగత్‌సింగ్‌నగర్ రోడ్ నం.2సీసీ రోడ్ పనులు, పద్మశాలిబస్తీ అంతర్గత లేన్ల సీసీ రోడ్ల పనులు, వివేకానందనగర్, పద్మశాలిబస్తీ రోడ్ నం.5 అంతర్గత సీసీ రోడ్ల పనులు, ఓల్డ్ చింతల్ అంతర్గత లేన్ల సీసీ రోడ్ల పనులు, చంద్రానగర్ రోడ్ నం.11 సీసీ రోడ్ పనులు, భగత్‌సింగ్‌నగర్ లైబ్రరీ నుంచి శ్మశానవాటిక వరకు సీసీ రోడ్ల పనులు, శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీ హాల్‌కు కాంపౌండ్ వాల్, వాష్‌రూమ్‌ల నిర్మాణ పనులకు వెంటనే మంజూరు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరగా వారు సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా విడతల వారీగా మంజూరు చేస్తారని హామీ ఇచ్చారని కార్పొరేటర్ రషీదారఫి తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



సాయిబాబా కల్యాణ మండపం వద్ద...



జగద్గిరిగుట్ట బస్టాప్‌లో...



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద...



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద...

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని పలు రద్దీ ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ఇవి ఒకపైపు ఒరిగి ఎప్పుడు ఏ అపాయం జరుగుదుందోనని స్థానికులు ఆందోనలకు గురవుతున్నారు. వీటిలో కొన్ని స్తంభాలు చాలా కాలం క్రితం వేసినవి ఉన్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్యుత్ వినియోగదారులు పెరగడంలో వీటిపై కనెక్షన్లు ఎక్కువయ్యాయి. ఇవే కాకుండా ఇంటర్ నెట్, కేబుల్ కనెక్షన్లు కూడా పెరగడంతో వీటిపై భారం పెరిగింది. ఈ కనెక్షన్లకు అనుగుణంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకపోవడం మూలంగానే ఈ సమస్య ఏర్పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీనికి తోడు ఈ స్తంబాలు ఉన్న పలు చోట్ల ఇటీవలే సీసీ రోడ్లు పనులు ప్రారంభించే సమయంలో రోడ్లు తవ్వడం, ఇవి కాస్తా ఓ వైపు ఒరిగిపోయాయి. ఎటువంటి ప్రమాదం జరగక ముందే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ఈ సమస్యను అరికట్టాలని వ్యాపారులు, వాహనాదారులు తదితరులు కోరుతున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029